సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



అన్నప్రసాద భవనానికి విరాళాలు

కొత్తపేట: వాడపల్లిలో అన్నప్రసాద భవన నిర్మాణానికి ఎస్.వెంకటేశ్వరరావు, (ఆర్యవటం) రూ.51,116, ఎన్.గిరిబాబు (పెనుమంట్ర) రూ.50,116 విరాళాలుగా ఇచ్చారు.



కళకాలం నిలిచేలా..

ఎప్పుడూ పుస్తకాల్లోని పాఠాలు చదువుతూ బిజీగా ఉండే విద్యార్థులు తమలోని ప్రతిభను బయటకు తీశారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటి శభాష్ అనిపించుకున్నారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం రాత్రి 3,37,621 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 12,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

చమురు సంస్థలపై చర్యలు తీసుకోని కూటమి

అమలాపురం టౌన్: ఏ రాష్ట్రంలో తమ అన్వేషణ, కార్యకలాపాలకు భూములను తవ్వుతారో ఆ ప్రాంతానికి చమురు సంస్థలు రాయల్టీ చెల్లించాలని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఎమ్మెల్సీ కుడుపూడి **సూర్యనారాయణరావు** గుర్తు చేశారు. కానీ ఆ **దిశగా కూటమి** ప్రభుత్వం చమురు సంస్థలపై **చర్యలు తీసుకోవడానికి** వెనకడుగు **వేస్తోందన్నారు. ఈ** మేరకు గురువారం అమలాపురంలో ప్రకటన విడుదల చేశారు. అంబానీ, **ఆదానీలకు వ్యతిరేకంగా** చమురు సంస్థలపై **కూటమి ప్రభుత్వం** చర్యలు తీసుకోలేకపోతోందన్నారు. **దీని వల్లే** జిల్లాలో ఓఎన్జీసీ వ్యతిరేక **పోరాట సమితి** చేస్తున్న పోరాటాలను కొంతకాలంగా **చమురు** సంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. **కేజీ బేసిన్‌లో** ఓఎన్జీసీ, రిలయన్స్, గ్యాస్ **అథారిటీ ఆఫ్** ఇండియా (వేదాంత) తదితర **చమురు సంస్థలు** విచ్చలవిడిగా ఆయిల్ **నిక్షేపాల కోసం** తవ్వేయడం వల్ల ఈ ప్రాంత **భూములు కుంగి**పోతూ, నిస్సారమవుతున్నాయని గుర్తు చేశారు. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో జిల్లా ప్రజాప్రతినిధులు.. ఓఎన్జీసీ అధికారులపై ధ్వజమెత్తడం, మీపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పడం స్వాగతించే విషయమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి అటు ప్రభుత్వం, ఇటు చమురు సంస్థలు ముందుకు రావడం లేదన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి స్వాగతం



ఎంపీ మిథున్‌రెడ్డిని సత్కరిస్తున్న పి.గన్నవరం ఇన్‌చార్జి శ్రీనివాసరావు

సాక్షి, రాజమహేంద్రవరం: లిక్కర్ అక్రమ కేసులో మధ్యంతర బెయిల్‌పై తిరిగి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డికి కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ నేతలు స్వాగతం పలికారు. వారిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్, పాముల రాజేశ్వరి, జ్యోతుల చంటిబాబు, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జి.శ్రీనివాసరావు ఉన్నారు. అనంతరం ఎంపీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

మెడికల్ కాలేజీల పేరిట కూటమి దందా



మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ కూటమి ప్రభుత్వం దందాకు పాల్పడుతోందని మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసి, వాటిలో కొన్నింటిని నిర్మాణం చేశారన్నారు. సంపద సృష్టిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. తమ ఎమ్మెల్యేలు, మంత్రులకు మాత్రమే సంపదను సృష్టించే పనిలో ఉందన్నారు. చంద్రబాబు అండ్ కో ప్రభుత్వ భూములను విచ్చిన్నం చేసి ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. ఖజానాలో డబ్బు లేదని మెడికల్ కాలేజీలను నిర్వహించలేమని డ్రామాలాడుతున్న చంద్రబాబు.. తన బినామీలకు ఒక్కో మెడికల్ కాలేజీని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 14 నెలల కాలంలో రూ.2 లక్షల కోట్లు అప్పులు చేసిన ఆయన.. మెడికల్ కాలేజీలకు రూ.5 వేల కోట్లు కేటాయించకపోవడం చాలా దారుణమన్నారు. ఇది ముమ్మాటికీ పేద వైద్య విద్యార్థులను మోసం చేయడమేనన్నారు. ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని మూడు సార్లు పరిపాలించిన చంద్రబాబు తన పాలనతో ఒక్కటైనా మెడికల్ కాలేజీ అయినా నిర్మించారా అని ప్రశ్నించారు.

వినాయకునికి వెండి పళ్లెం సమర్పణ



అర్చకునికి వెండి పళ్లెం అందజేస్తున్న అవినాష్ దంపతులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి విశాఖపట్నం తగరపు వలసకు చెందిన కటకం అవినాష్, సాహిత్య శృతి దంపతులు గురువారం వెండి పళ్లెం సమర్పించారు. 1050 గ్రాములు బరువైన ఈ పళ్లెం విలువ రూ.1,35,000 ఉంటుంది. దాతలు దీన్ని ఆలయ అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. అనంతరం వారిని ఆలయ అర్చకులు, వేద పండితులు సత్కరించి, స్వామివారి శేష వస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



మీ తప్పిదాలపై వార్తలు రాస్తే కేసులా?

కూటమి ప్రభుత్వం చేస్తున్న వరుస తప్పిదాలపై వార్తలు రాస్తే పోలీసు కేసులు పెట్టి వేధిస్తారా?, ఇదెక్కడి దారుణం. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టడం చూస్తుంటే ఈ కూటమి ప్రభుత్వం విధానపరంగా కాకుండా కక్ష సాధింపు ధోరణిలోనే వెళుతోందని అనిపిస్తోంది. దీనిని కూటమి ప్రభుత్వం అనడం కన్నా కుట్ర, కుతంత్రాల ప్రభుత్వం అంటేనే బాగుంటుంది.

– విప్పర్తి విశ్వరూప్, మాజీ మంత్రి, అమలాపురం



పత్రికా స్వేచ్ఛను హరించడం అన్యాయం



పత్రికా స్వేచ్ఛను హరించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయం. పత్రికలు, ఎడిటర్లు, జర్నలిస్టులపై కక్షపూరిత చర్యలకు పాల్పడడం సరికాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల ద్వారా ఎంతో మంది తమ అభిప్రాయాలను ధైర్యంగా చెబుతారు. వార్తలు తప్పు అని భావిస్తే వాటిని ఖండించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఏదైనా నిజం చెప్పినా, దానిని ప్రచురించినా కేసులు పెట్టే సంస్కృతి ఎక్కువైంది. ఇలాగే సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు పెట్టడం అత్యంత దుర్మార్గం.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి

కౌంట్‌డౌన్

- ఆక్వా రైతులకు వరుస కష్టాలు
- ఇప్పటికే సుంకాల మోత
- తాజాగా వైరస్ విజృంభణ

సాక్షి, అమలాపురం: ఆక్వా రైతులను వరస కష్టాలు వెంటాడుతున్నాయి. మొదటి పంటకు సుంకాల వాత, రెండో పంటపై వైరస్ దాడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వనామీకి అమెరికా, యూరప్ దేశాల నుంచి క్రిస్మస్ ఆర్డర్లు మొదలయ్యాయి. అమెరికా సుంకాల భారం పడుతున్నా డిమాండ్ కారణంగా దేశీయ మార్కెట్‌లో వనామీ రొయ్యల ధరలు కొంత వరకు పర్వాలేదు. అయితే వైరస్‌ల వల్ల తక్కువ సైజులో రొయ్యలు చనిపోతుండడంతో ఆక్వా రైతులు పెరిగిన మార్కెట్‌ను అందుకోలేకపోతున్నారు.

ధరల పతనం

ఏడాది కాలంగా వనామీ రొయ్యలకు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగిన ప్రతిసారి ఏదో ఒక ఉపద్రవం రావడం, ధరలు పతనం కావడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఇందుకు విరుద్ధమైన పరిస్థితి ఉంది. ధరలు స్వల్పంగా పెరిగాయి. కానీ వైరస్ కాటుతో వనామీకి భారీ నష్టాలు వస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 77 వేల ఎకరాలలో ఆక్వా సాగు జరుగుతోంది. దీనిలో కాకినాడ జిల్లాలో ఎనిమిది వేల ఎకరాలు, కోనసీమ జిల్లాలో 15 వేల ఎకరాలు చొప్పున సాగవుతున్నాయి.

సంక్షోభం

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఆశాజనకంగా ఉన్న వనామీ సాగు ఆ తర్వాత తీవ్ర సంక్షోభంలో పడింది. **మార్చిలో స్థానిక ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి వేశారు. దేశీయ ఎగుమతులపై అమెరికా 25 శాతం సుంకాల విధించడంతో వనామీ రొయ్యల ధరలు కౌంట్‌కు వచ్చి కేజీకి రూ.40 నుంచి రూ.60 ధరలు తగ్గించడంతో ఆక్వా పెను సంక్షోభంలో కూరుకుపోయింది.** అమెరికాలోని వినియోగదారులపై పడాల్సిన భారాన్ని ఎగుమతిదారులు ఇక్కడ రైతులపై మోపారు. ఆ తర్వాత సుంకాల విధింపు మూడు నెలల పాటు వాయిదా వేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. కానీ కౌంట్‌కు రూ.15 మాత్రమే ధర పెంచడం విశేషం. రెండోసారి సుంకాల విధింపు ప్రకటన వచ్చిన తర్వాత మరోసారి ధరలు పతనమయ్యాయి.

కాపాడిన క్రిస్మస్

అమెరికాతో పాటు యూరప్ దేశాలలో ఈ నెలాఖరు నుంచి క్రిస్మస్ సందడి మొదలు కానుంది. ఇందుకు ఆయా దేశాల నుంచి ఆర్డర్లు రావడంతో ధరలు కొంత వరకు పెరిగాయి. ప్రస్తుత మార్కెట్‌లో 30 కౌంట్ (కేజీకి 30 రొయ్యల) ధర రూ.405 వరకు ఉంది. 40 కౌంట్ రూ.350, 45 కౌంట్ రూ.340, 50 కౌంట్ రూ.330, 60 కౌంట్ రూ.310, 70 కౌంట్ రూ.290, 80 కౌంట్ 265, 90 కౌంట్ రూ.245, 100 కౌంట్ రూ.235 చొప్పున ఉంది.

ధర పెరగక..

అమెరికా రెండోసారి సుంకాలను 50 శాతానికి పెంచడంతో 50 కౌంట్ నుంచి 30 కౌంట్ వరకు ధరలు భారీగా తగ్గుతాయని రైతులు, ఎగుమతిదారులు భయపడ్డారు. అయితే క్రిస్మస్ ఎగుమతులు కారణంగా ధరలు కొంత వరకు నిలబడ్డాయని ఎగుమతిదారులు అంచనా వేస్తున్నారు. అమెరికాకు ఈ సీజన్‌లో ఎగుమతి అయ్యే రొయ్యల కన్నా ఇప్పుడు ఎగుమతి అయ్యే రొయ్యలు తక్కువగా ఉన్నా ఆ లోటును యూరప్ దేశాలు భర్తీ చేస్తున్నాయి. దీని వల్ల ధర నిలకడగా ఉంది. అయితే 100 కౌంట్ స్థానిక రైతులకు గిట్టుబాటు కావడం లేదు. పెరిగిన మేత, రొయ్య పిల్లలు, విద్యుత్ భారం వల్ల 100 కౌంట్ ఉత్పత్తికి రూ.240 వరకు అవుతోందని రైతులు చెబుతున్నారు. దేశీయంగా ఈ కౌంట్‌కు మంచి డిమాండ్ ఉన్నా ధర పెరగక పోవడం వెనుక ఎగుమతి దారుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెండో పంటకు వైరస్

ఒక వైపు ధరలతో సతమతమవుతున్న రైతులను వనామీ రొయ్యలకు వస్తున్న వైరస్‌లు ముప్పు తిప్పలు పెడుతోంది. ప్రధానంగా వైట్ స్పాట్, వైట్ గట్, ఈహెచ్‌పీలు అధికంగా సోకుతున్నాయి. వీటి దాడులతో వనామీ విలవిలాడుతోంది. చాలా చిన్న వయసులోనే మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలో రొయ్య పిల్లలు వదిలిన 30 నుంచి 60 రోజుల వ్యవధిలో ఈ వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ఆ సమయానికి రొయ్య పిల్ల బరువు మూడు గ్రాముల నుంచి పది గ్రాముల లోపు ఉంటోంది. రొయ్యల కౌంట్ 100 నుంచి 140 కౌంట్ మధ్యలో వైరస్ సోకి చనిపోతున్నాయని, దీని వల్ల అధికంగా నష్టపోతున్నామని అమలాపురం మండలం సమనసకు చెందిన దొరబాబు 'సాక్షి' వద్ద వాపోయారు.



వనామీ సాగు



చిన్న వయసులో పట్టుబడి పట్టిన వనామీ రొయ్యలు



ఈహెచ్‌పీ సోకిన రొయ్యలలో సైజుల తేడా

రొయ్యల పెరుగుదలలో వ్యత్యాసం

ఈహెచ్‌పీ అధిక నష్టాలను మిగులుస్తోంది. ఈ వైరస్ వల్ల రొయ్యల పెరుగుదలలో వ్యత్యాసం అధికంగా ఉంటోంది. ఒకే చెరువులో రొయ్యల పట్టుబడులు చేస్తుంటే కొన్ని 100, మరికొన్ని 120, 150 కౌంట్ వస్తున్నాయి. దీని వల్ల నష్టం తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో రైతులు జూలై నుంచి రెండో పంట మొదలు పెట్టారు. ఈ సమయంలో పంట మొదలు పెట్టిన 40 శాతం చెరువులు వైరస్ బారిన పడ్డాయని అంచనా. ఇదే వనామీ రైతులను కుంగదీస్తోంది. కొన్ని హేచరీల నుంచి వైరస్ సోకిన రొయ్య పిల్లలు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు..

టీడీపీ, జనసేన నాయకుల వాగ్వాదం



సభలో టీడీపీ, జనసేన నాయకులను వారిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అయినవిల్లి: తొత్తరమూడిలోని షాపు నంబర్ 28లో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సభకు స్థానిక సర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. వేదికపైకి టీడీపీ నాయకులను పిలిచి, జనసేనకు చెందిన వైఎస్ ఎంపీపీ అడపా నాగభూషణాన్ని పిలవలేదు. దీంతో జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ, జనసేన నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కాగా. ఈ సభను ముక్తేశ్వరం – శానపల్లిలంక రహదారి చెంతన నిర్వహించారు. రహదారి పైనే సభ నిర్వాహకులు కుర్చీలు వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. సభకు ఎమ్మెల్యే రెండు గంటలు ఆలస్యంగా రావడంతో లబ్ధిదారులు, అధికారులు అవస్థలు పడ్డారు.

రసాయన రహిత ఉత్పత్తులు అందించాలి



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సేంద్రియ విధానంలో పండించిన అరటి పండ్లను అందిస్తున్న రైతులు

అమలాపురం రూరల్: వినియోగ దారులకు రసాయన రహిత ఆహార ఉత్పత్తులను అందించాలని రైతులకు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ అమలులో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో సేంద్రియ వ్యవసాయం పద్ధతులపై వ్యవసాయ అనుబంధ విభాగాలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్షిక కార్యాచరణ ప్రణాళికలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించడం ద్వారా మానవుని సగటు జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ఈ వ్యవస్థ రూపొందించబడిందన్నారు. డీఆర్డీఏ అధికారులు మరింత మంది డ్వాక్రా సంఘాలకు ప్రకృతి సేంద్రియ కషాయాల తయారీలో శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. దీనిలో భాగంగా ఈ నెల 20 నాటికి మండలాల వారీగా ప్రకృతి సేద్య విధానాల అమలుపై కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి సమర్పించాలన్నారు. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం శ్రీనివాసు, అదనపు డీపీఎం సత్యనారాయణలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 15 వరకు గాలికుంటు టీకాలు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలను ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ అందించాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి ఆ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సకాలంలో టీకాలు వేస్తూ పశు వ్యాధులను నియంత్రించాలన్నారు. పశుసంపదను పెంచడంతో పాటు వాటి ఆరోగ్య పరిరక్షణకు పశు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. నాలుగు నెలల వయసు దాటిన పశువులకు తప్పని సరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని అధికారులకు ఆదేశించారు.

లక్ష్మీనరసింహస్వామికి రూ.35,62 లక్షల ఆదాయం



హుండీల ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి హుండీల ద్వారా రూ.35,62,444 ఆదాయం సమకూరింది. ఈ ఏడాది జూన్ 20 నుంచి సెప్టెంబర్ 11 వరకూ 83 రోజులకు గాను ఈ మొత్తం సమకూరింది. దేవదాయశాఖ జిల్లా అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కింపు చేపట్టారు. మొత్తం ఆదాయంలో మెయిన్ హుండీల ద్వారా రూ.35,07,678, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ నుంచి రూ.14,679, అన్నదానం హుండీల ద్వారా రూ.40,087 లభించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. అలాగే 4 గ్రాముల బంగారం, 39 గ్రాముల వెండి లభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్ బాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- అధికారులకు నేడు వినతులు అందిస్తాం
- ఆంధ్ర ఆటోవాలా జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు



ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్ర ఆటోవాలా జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు

అమలాపురం టౌన్: ఎన్నికల సమయంలో తమకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ శుక్రవారం కలెక్టర్, మండలాల తహసీల్దార్లకు ఆటో యూనియన్ల సభ్యులు వినతి పత్రాలు అందించాలని ఆంధ్ర ఆటోవాలా యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు పిలుపునిచ్చారు. అమలాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పినట్టు ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు చొప్పున.. రెండేళ్లకుగాను వాహన మిత్ర పథకం కింద రూ.30 వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 50 ఏళ్లు దాటిన ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా పింఛన్ అందించాలని, ఆటోలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆంధ్రా ఆటో వాలా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, కోశాధికారి మోకా శ్రీను, డివిజన్ అధ్యక్షుడు బొలిశెట్టి వంకర్, ప్రధాన కార్యదర్శి బొక్కా నాని, కోశాధికారి బొమ్మి ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఆటోల బంద్ తాత్కాలికంగా వాయిదా

కూటమి ప్రభుత్వం ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు ఇస్తానని ప్రకటించిన కారణంగా జిల్లాలో శుక్ర, శనివారాల్లో తలపెట్టిన ఆటోల బంద్, సామూహిక నిరాహార దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సత్తిరాజు ప్రకటించారు. జిల్లాలోని ఆటో డ్రైవర్లు వాయిదా విషయాన్ని గమనించాలన్నారు.

సంస్కృతుల వారధి.. సమైక్య సారథి

- దేశంలో హిందీ భాషకు ఎంతో ప్రాధాన్యం
- జాతీయ భాషగా గుర్తింపు
- ఈ నెల 14న జాతీయ హిందీ దివస్

రాయవరం: భారతదేశం వివిధ సంస్కృతులు, విభిన్న భాషలు, నాగరికతలకు నెలవు. ఒకరి అభిప్రాయాలను ఒకరు తెలుసుకునేందుకు, మాట్లాడేందుకు భాష అవసరం. ప్రతి రాష్ట్రానికి ప్రాంతీయ భాష ఉంటుంది. దాదాపు 3,372 పైగా భాషలను దేశ ప్రజలు మాట్లాడుతుండగా, వాటిలో అధికారికంగా 24 భాషలను గుర్తించినప్పటికీ జాతీయ భాషగా హిందీని భావిస్తున్నాం. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని జాతీయ అధికారిక భాషగా గుర్తించింది. అప్పటి నుంచి ఏటా సెప్టెంబర్ 14వ తేదీని హిందీ దివస్‌గా జరుపుకొంటున్నారు.

హిందీ నేపథ్యం

పర్షియన్ పదం 'హింద్' నుంచి హిందీ పుట్టుకొచ్చింది. ఇండస్ నది పారుతున్న నేలలో మాట్లాడే భాష అని దీని అర్థం. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన రెండు భాషల్లో హిందీ ఒకటి. ఇది దేవనాగరి లిపిలో ఉంటుంది. దేశంలో అత్యధికులు మాట్లాడే భాష హిందీ. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో హిందీ నాలుగో స్థానంలో ఉంది. భారత్‌తో పాటు పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, న్యూజిలాండ్, యూఏఈ, ఉగాండా, గయానా, ట్రినిడాడ్, మారిషస్, దక్షిణాఫ్రికాల్లో హిందీని ఎక్కువగా మాట్లాడుతారు.



హిందీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విశిష్ట సేవలు అందిస్తున్న ప్రచారక్‌లు



హిందీ భాషపై, ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కలిగింది. ఫలితంగా అన్ని ప్రాంతాల్లో హిందీ ప్రచారక్‌లు ముందుకు వచ్చి హిందీ ప్రాథమిక స్థాయి పరీక్షల నుంచి ఉన్నత స్థాయి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థులను తయారు చేస్తున్నారు. ప్రైవేట్ ఉద్యోగులు సైతం ఈ కోర్సులు పూర్తి చేసి, అనంతరం ప్రభుత్వ కొలువులు పొందుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే భాషలను జనాభాపరంగా పరిశీలిస్తే ఇంగ్లిషు, చైనా భాషల తర్వాతి స్థానం హిందీదే. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వెబ్ అడ్రస్‌లు రూపొందించడానికి ఉపయోగిస్తున్న ఏడు భాషల్లో హిందీ ఒకటి.

ఎంతో మందిని టీచర్లుగా తీర్చిదిద్దా



హిందీ భాష ద్వారా ఉపాధి పొందడానికి అవకాశం ఉంది. దీన్ని నేర్చుకున్న చాలామంది దేశ, విదేశాల్లో ఉపాధి పొందారు. వందల మంది హిందీ ప్రచార సభ ద్వారా శిక్షణ పొంది హిందీ ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్నారు.

– మహ్మద్ అబ్దుల్ హమీద్, విశ్రాంత టీచర్, కేంద్ర వ్యవస్థాపక్, హిందీ ప్రచార సభ, మలికిపురం.

హిందీ భాషతో ఉపాధి



చాలా మంది పది, ఇంటర్ తర్వాత హిందీ సబ్జెక్టుగా తీసుకుని డిగ్రీ చేస్తున్నారు. తర్వాత హిందీ పండిట్ శిక్షణ పొంది మంచి ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. హిందీ భాషకు సంబంధించి ప్రస్తుతం ట్యూషన్ సెంటర్ల ద్వారా చాలా మంది ఉపాధి పొందుతున్నారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా ఎంతో మందితో పరీక్షలు రాయిస్తున్నాను.

– పి.చిట్టి రుక్మిణి, విశ్రాంత గ్రేడ్–1 హిందీ టీచర్, రామచంద్రపురం

వారసత్వ సంపద



హిందీ భాష భారతీయులందరికీ వారసత్వ సంపద లాంటిది. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి ఈ భాషకు ప్రాముఖ్యత ఉంది. ఈ భాషాభివృద్ధికి విద్యార్థి దశ నుంచే ప్రోత్సాహం అందించాలి. భాషపై ఏకాగ్రత ఉంచితే నేర్చుకోవడం చాలా సులభం.

– మద్దింశెట్టి రాంబాబు, హిందీ టీచర్, పసలపూడి, రాయవరం మండలం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 - 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 - 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి


గోవరాజు (ఫైల్)

తాళ్లరేవు: జాతీయ రహదారిపై మట్లపాలెం వంతెన వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వలిపూడి గోవరాజు (41) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పటవల పంచాయతీ కొత్తూరుకు చెందిన గోవరాజు రాత్రి సమయంలో రోడ్డు దాటుతుండగా యానాం వైపు నుంచి కాకినాడ వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవరాజు తలకు తీవ్ర గాయమైంది. అతడిని స్థానికులు హుటాహుటీన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోవరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


గుర్రం కొండలరావు (ఫైల్)

అల్లవరం: కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు గుర్రం గంగాధర్ (బాబ్జి) తండ్రి కొండలరావు (100) గురువారం ఉదయం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని పలువురు రాజకీయ ప్రముఖులు, గ్రామస్తులు సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కళకాలం నిలిచేలా..

- డైట్‌లో కళా ఉత్సవ్ పోటీలు ప్రారంభం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 130 మంది విద్యార్థుల హాజరు


పోటీల విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు, అధ్యాపకులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


మృదంగం వాయిస్తున్న కార్తికేయ హిమాన్షు


గాత్రం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: ఎప్పుడూ పుస్తకాల్లోని పాఠాలు చదువుతూ బిజీగా ఉండే విద్యార్థులు తమలోని ప్రతిభను బయటకు తీశారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటి శభాష్ అనిపించుకున్నారు. బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణసంస్థ (డైట్)లో గురువారం కళా ఉత్సవ్ 2025 పేరిట జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు నిర్వహించిన పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. గాత్రం, వాయిద్య సంగీతం, నృత్యం అంశాల్లో సోలో, గ్రూప్ విభాగాలలో పోటీలు జరిగాయి. వీటికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 35 పాఠశాలల నుంచి 130 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సృజనాత్మకతకు వేదిక

ప్రారంభోత్సవంలో డైట్ ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు మాట్లాడుతూ విద్యార్థులలో దాగిన సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచి వారికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక పరిపక్వతకు, మనో వికాసానికి ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. శుక్రవారం సోలో(2డి), సోలో(3డి), గ్రూపు (2డి/3డి), థియేటర్ ఆర్ట్స్, సంప్రదాయ కథనాలకు సంబంధించి గ్రూపు విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు.

బహుమతుల ప్రదానం

తొలిరోజు జరిగిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ ఆర్‌జేడి రాజు చేతులమీదుగా సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందజేశారు. వీరందరూ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా కేటీ సుబ్బరాయన్, ఎం.నాగేశ్వరరావు, డి. రవి కిరణ్ వ్యవహరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎం.రాజేష్, వి.శిరీష ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- గాత్రం వ్యక్తిగత విభాగంలో కె.షర్మిల, బృంద విభాగంలో ఎస్.సుమశ్రీ, ఆర్.భారతి, ఈ.నాగజ్యోతి, కె.శిరీష (అంబేడ్కర్ గురుకులం, ఏలేశ్వరం)
- వాయిద్యం వ్యక్తిగత విభాగానికి సంబంధించి స్ట్రింగ్‌లో టీవీకే దేవీ ప్రియాంక (భాష్యం స్కూల్, కాకినాడ), పెర్కషన్‌లో కె.కార్తికేయ హిమాన్షు (కలాం జూనియర్ కళాశాల, రాజమహేంద్రవరం).
- నృత్యం వ్యక్తిగత విభాగంలో సీహెచ్ హేమసత్య (చేబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాల), బృంద విభాగంలో సీహెచ్ త్రిలోచన, పి.జ్యోతి లహరి, జి.చరణ్ సాత్విక్, ఎం.పవన్ కుమార్ (గాంధీపురం మున్సిపల్ హైస్కూల్, రాజమహేంద్రవరం).

మూతపడే దుస్థితికి చేనేత సంఘాలు


సమావేశంలో మాట్లాడుతున్న దొంతంశెట్టి సత్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: చేనేత సహకార సంఘాల నిధులన్నీ ఆప్కో బకాయిల రూపంలో స్తంభించిన కారణంగా సభ్యులకు ఉపాధి కల్పించలేని దుస్థితికి సంఘాలు చేరుకున్నాయని లివరీ ఫెడరేషన్ చైర్మన్ దొంతంశెట్టి సత్య ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. హసన్‌బాద చేనేత సహకార సంఘం భవనంలో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల లివరీ చేనేత సహకార సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సత్య ప్రకాశ్ మాట్లాడుతూ గడిచిన 10 నెలలుగా బకాయిలు పేరుకు పోయాయన్నారు. బ్యాంకుల నుంచి మంజూరు కాబడిన నిధులు పూర్తిగా వినియోగించుకోలేక పోవడంతో సంఘాల బ్యాంకు ఖాతాలన్నీ ఎన్‌పీఏలోకి వెళుతున్నాయన్నారు. కొన్ని సంఘాలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఆప్కోకు ఎన్నికలు నిర్వహించి గాడిన పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హసన్‌బాద, ఆదివారపుపేట, శివల, అద్దంపల్లి, నేలటూరు, ముమ్మిడివరం, తమ్మవరం, మురారి, నల్లూరు తదితర చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

22 నుంచి పీఠంలో శరన్నవరాత్ర ఉత్సవాలు


శరన్నవరాత్ర ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న పీఠాధిపతి గాడ్ తదితరులు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విజయదుర్గా పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు గురువారం విలేకరులకు తెలిపారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) సమక్షంలో శరన్నవరాత్రి ఉత్సవ వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 22న ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి రోజు ఉదయం 8.19 గంటలకు గురుహోరలో కలశ స్థాపన జరుగుతుందన్నారు. పీఠంలోని కొలువైన విజయదుర్గా అమ్మవారికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు.

అమ్మవారు దర్శనమిస్తారిలా..

ఈ నెల 22న బాలాత్రిపుర సుందరి, 23న గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న రజిత కవచ అలంకృత విజయదుర్గాదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలిత త్రిపుర సుందరీదేవి, 28న విజయదుర్గాదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ ఒకటిన మహిషాసురమర్దని, 2న రాజరాజేశ్వరి అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పీఠాధిపతి గాడ్ సమక్షంలో అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి తదితరులు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. పీఠానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

భోజనం కోసం ఆగితే దోచేశారు

- ప్రైవేటు బస్సులో చోరీ
- తాళ్లూరులో దాబా వద్ద ఆపిన సమయంలో ఘటన
- 600 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు ఉన్న బ్యాగు మాయం

గండేపల్లి: జాతీయ రహదారిలో తాళ్లూరు వద్ద బుధవారం రాత్రి బస్సులో హైటెక్ చోరీ జరిగింది. 600 గ్రాముల బంగారం, రూ.40 వేలు ఉన్న ప్రయాణికుడి బ్యాగు మాయమైంది. వివరాల్లోకి వెళితే.. విజయనగరం నుంచి తిరుపతి వెళుతున్న మార్నింగ్ స్టార్ అనే ప్రైవేటు బస్సు బుధవారం రాత్రి 8.30 నుంచి 9 గంటల మధ్యలో జాతీయ రహదారిపై గండేపల్లి మండలం తాళ్లూరులో రోడ్డు పక్కనే ఉన్న ఒక దాబా వద్ద ఆగింది. భోజనాలు చేసేందుకు డ్రైవర్ బస్సును ఆపడంతో ప్రయాణికులందరూ దిగి వెళ్లారు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తులు బస్సులోని ఓ బ్యాగును తీసుకుపోయారు. దీన్ని కొందరు ప్రయాణికులు గుర్తించి కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అనంతరం దాబాలోని బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన ఓ ప్రయాణికుడు బస్సులోకి ఎక్కి, తన బ్యాగు కనిపించడం లేదని కంగారు పడ్డాడు. బ్యాగు చోరీకి గురైనట్టు గ్రహించి గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జగ్గంపేట, గండేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే బస్సు రాజమహేంద్రవరం వరకూ వెళ్లిపోవడంతో, దాన్ని వెనుకకు రప్పించారు. డ్రైవర్‌తో సహా ప్రయాణికుల వివరాలను నమోదు చేసుకుని బస్సును పంపించివేశారు.

పోలీసుల దర్యాప్తు

బ్యాగు తీసుకువస్తున్న ఆ వ్యక్తి నెల్లూరులోని ఒక సేటుకు చెందిన నగల దుకాణంలో పనిచేస్తుంటాడు. విజయనగరంలో రెడీమేడ్ నగలను దుకాణాలకు అందజేసి తిరిగి వస్తుండగా ఈ చోరీ జరిగింది. బ్యాగులో రూ.60 లక్షల విలువైన 600 గ్రాముల బంగారం, రూ.40 వేలు నగదు ఉంది. అయితే ఈ చోరీపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. బ్యాగు తీసుకువస్తున్న వ్యక్తిని విజయనగరం నుంచి ఎవరైనా ఫాలో అయ్యారా అనే విషయం తేలాల్సి ఉంది. బస్సును దాబా వద్ద నిలిపిన సమయంలో హైవేపై ఉన్న ఒక కారులో నుంచి వచ్చిన వ్యక్తులు ఈ బ్యాగును తీసుకుపోయినట్టు చెబుతున్నారు. ఆ దిశగా సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగ బాబు, సిబ్బంది దర్యాప్తు ముమ్మరం చేశారు.

ప్లీనరీ సెషన్‌లో 'ఆదిత్య' సతీష్ రెడ్డి


న్యూఢిల్లీ తాజ్ ప్యాలెస్‌లో ప్రముఖులతో ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో ఈ నెల 10న జరిగిన అఖిల భారత మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ప్లీనరీ సెషన్‌లో ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. పారిశ్రామిక, విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని, మేనేజ్‌మెంట్, వ్యాపార రంగాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారన్నారు. కార్యక్రమంలో నితిన్ ఆత్రోలే (చీఫ్ స్ట్రాటజీ, కేపీఎంజీ), సంజయ్ కుమార్ సింగ్ (డైరెక్టర్, స్ట్రాటజీ, ఎక్స్‌టర్నల్ రిలేషన్స్, జిందాల్ స్టీల్ లిమిటెడ్), సంజయ్ నారాయణ్ (చీఫ్ జనరల్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), తదితర ప్రముఖులు పాల్గొన్నారన్నారు.

తిరుమల విద్యాసంస్థల సిబ్బంది రక్తదానం


రక్తదానం చేసిన సిబ్బందిని అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు జన్మదినం సందర్భంగా గురువారం తిరుమల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కాతేరులోని సంస్థ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్టు, డాక్టర్ వైఎస్సార్ అండ్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాలలో సుమారు 265 మంది తిరుమల సిబ్బంది రక్తదానం చేశారు. వారికి నున్న తిరుమలరావు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రక్తాన్ని డబ్బుతో కొనలేమని, వెల కట్టలేనిదన్నారు. ప్రపంచంలో మనిషి నుంచి మాత్రమే రక్తం లభిస్తుందన్నారు. ఒక వ్యక్తి తన జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో తిరుమలరావు సోదరులు నున్న కృష్ణ, నున్న సురేష్, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ నల్లగుంటకు చెందిన బాలిక ఈ నెల ఒకటో తేదీన పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికి బాలిక పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ పది రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.

ఉత్కంఠగా చెస్ ర్యాపిడ్, బ్లిట్జ్ పోటీలు


విజేతకు బహుమతి అందజేస్తున్న జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విక్టరీ అకాడమీలో గురువారం జిల్లా స్థాయిలో చెస్ ర్యాపిడ్, బ్లిట్జ్ పోటీలు ఉత్కంఠగా జరిగింది. ఈ జిల్లా చెస్ చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించి ర్యాపిడ్ విభాగంలో బండారు నానిబాబు ప్రథమ, ద్రాక్షారపు సాత్విక్ ద్వితీయ స్థానాలు, బ్లిట్జ్ విభాగంలో ద్రాక్షారపు సాత్విక్ ప్రథమ, పనిశెట్టి సాయి అవినాష్ ద్వితీయ స్థానాలు సాధించారు. జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ మాట్లాడుతూ విజేతలు ఈ నెల 13 నుంచి నంద్యాలలో జరిగే రాష్ట్ర ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ అండర్–19 విభాగానికి డాన్ బాస్కో హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆర్.పవన్ కుమార్, ఎ.వినయ్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ జె.విద్యాసాగర్ గురువారం తెలిపారు. కర్నూలులో ఈ నెల 22 నుంచి 24 వరకూ జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 10న జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలుర విభాగంలో జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిభ చూపారన్నారు.

జూదరులకు జరిమానా

కిర్లంపూడి: పేకాట ఆడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వారిని గురువార ంప్రత్తిపాడు కోర్టుకు హాజరు పర్చామన్నారు. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున జరిమానా విధించారన్నారు. మరోసారి పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనితీరుతో ఉద్యోగులకు గుర్తింపు

- పంచాయతీరాజ్ కమిషనర్ ముత్యాలరాజు
- ఈటీసీలో ఎంపీడీఓల శిక్షణ పరిశీలన


ఈటీసీ ఆవరణను పరిశీలిస్తున్న కమిషనర్ ముత్యాలరాజు తదితరులు

సామర్లకోట: ఉద్యోగులు మంచి పనితీరుతో గుర్తింపు పొందవచ్చని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ కమిషనర్ రేవు ముత్యాలరావు అన్నారు. సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రానికి (ఈటీసీ) గురువారం ఆయన విచ్చేశారు. అక్కడ ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జల్లాల్లోని ఎంపీడీఓలకు జరుగుతున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ముత్యాలరాజు మాట్లాడుతూ ప్రాధాన్యతాక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రతిచోటా ఎదురయ్యే సమస్యలను నైపుణ్యంతో సమర్థంగా అధిగమించాలన్నారు. అంతకు ముందు జరిగిన ఈటీసీ నిర్వహణ కమిటీ సమావేశానికి కమిషనర్ ముత్యాలరాజు అధ్యక్షత వహించారు. ఈటీసీలో జరుగుతున్న శిక్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ కావాల్సిన అవసరాలపై ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. జీఎస్‌డబ్ల్యూ, వైద్యం, విద్య, ఇంజినీరింగ్ వంటి ఇతర శాఖల శిక్షణలు కూడా ఈటీసీలో జరిగేలా తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం విస్తరణ శిక్షణ కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, డీడీఓలు శ్రీనివాస్, విజయ భాస్కర్, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన విల్లు, బాణం



కపిలేశ్వరపురం (మండపేట): అయోధ్యలో నిర్మిస్తున్న కల్యాణ రాముని ఆలయానికి సమర్పించేందుకు దాత విల్లు, బాణం తయారీకి మండపేటలో ఆర్డర్ చేశారు. మండపేటలోని రామకృష్ణా బ్రాస్ అండ్ సిల్వర్ వర్క్స్ నిర్వాహకుడు, శిల్ప కళాకారుడు వాసా శ్రీనివాస్ గోల్డ్ కోటింగ్‌తో వీటిని రూపొందించారు. అయోధ్యకు చెందిన వంశ వృక్షం అన్నదాన ట్రస్ట్ నిర్వాహకులు చల్లా శ్రీనివాస్ శాస్త్రి, గాయత్రి దంపతులు రూ.1.80 లక్షలతో తయారు చేయించారు. వాటిని గురువారం చల్లా శ్రీనివాస్ శాస్త్రి అయోధ్య నుంచి మండపేటకు వచ్చి తీసుకెళ్లారు. కళాకారుడు వాసా శ్రీనివాస్ నైపుణ్యాన్ని ఆయన ప్రసంశించారు.

అన్నం పెట్టిన ఇంటికే ద్రోహం

- కాకినాడ చోరీ కేసులో పనిమనిషి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగ దుర్గారావు

కాకినాడ క్రైం: కాకినాడలో జరిగిన చోరీ కేసులో పనిమనిషే దొంగ అని తేలింది. అన్నం పెట్టిన ఇంటికే ఆమె ద్రోహం చేసింది. సీఐ నాగ దుర్గారావు తెలిపిన వివరాల మేరకు.. బాలాజీ చెరువు జంక్షన్ సమీపంలోని కొమ్మిరెడ్డివారి వీధిలో నివాసముంటున్న బత్తుల కనకదుర్గ ఇంట్లో కొద్ది రోజులుగా వనమాడి జగదాంబ అనే మహిళ పనిచేస్తోంది. ఈ నెల 2వ తేదీన యజమాని ఇంటి నుంచి 277 గ్రాముల బంగారం, రూ.లక్ష దొంగిలించింది. ఈ విషయాన్ని గుర్తించిన కనకదుర్గ కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. వన్ టౌన్ పోలీసులతో పాటు క్రైం సీఐ కృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా పనిమనిషి నిర్వాకం బయటపడింది. దీంతో జగదాంబను పోలీసులు గురువారం మధ్యాహ్నం జగన్నాథపురం మరిడమ్మపేటలోని ఆమె ఇంటి వద్ద అరెస్టు చేశారు. ఆమె నుంచి 183 గ్రాముల బంగారంతో పాటు రూ.లక్ష మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు

- విద్యాశాఖ ఏఓ షరీఫ్
- రాష్ట్ర స్థాయికి 106 మంది ఎంపిక


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి శ్రీను


ఆర్చరీ విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో రాణించే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా పాఠశాల విద్యాశాఖ ఏఓ షరీఫ్ తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో గురువారం పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 విభాగంలో క్రీడాకారుల ఎంపికలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌ఐ) కార్యదర్శి కనకాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఏఓ షరీఫ్, గౌరవ అతిథులుగా రూరల్ ఎంఈఓ టీవీఎస్ రంగా రావు, అర్బన్ ఎంఈఓ రవి హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను షరీఫ్, ఎస్‌జీఎఫ్‌ఐ జెండాను రవి ఆవిష్కరించారు. రూరల్ ఎంఈఓ టీవీఎస్ రంగారావు, చేయూత సంస్థ అధ్యక్షుడు రవి, హరీష్ స్పోర్ట్స్ అధినేత హరీష్, మాజీ ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి జార్జి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు శ్రీను క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో అండర్ 14, 17 విభాగంలో ఆర్చరీ, ఘట్కా, సపక్ తక్రా క్రీడల్లో నిర్వహించిన ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 350 మంది హాజరయ్యారు. వీరి నుంచి రాష్ట్ర స్థాయికి 106 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ఐ మాజీ కార్యదర్శి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సునీల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ ప్రతినిధి మాచర రావు, ఆర్చరీ కోచ్ లక్ష్మణ్, మాజీ పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, పట్టాభి, గిరి, గాంధీ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. ఎంపికలను పాఠశాల క్రీడా సమాఖ్య సంయుక్త కార్యదర్శి సుధారాణి పర్యవేక్షించారు.